# అమృతప్రాయం

- ముద్రగడ సూర్యప్రకాశరావు

''మమ్మీ! మమ్మీ! మన పనిమనిషేమో చెంగులో ఏదో దాచేసింది మమ్మీ!'' ఈజీ ఛైర్‌లో కూర్చుని నవల చదువుకుంటోన్న తల్లి చెవిలో, ఏదో రహస్యం కనిపెట్టిన దాన్లా, గుసగుసగా చెప్పింది రోషిణి.

''ష్! డోంట్ డిస్ట్రబ్ బేబీ!'' అంది మాధవి. నవలలోంచి తలెత్తి కూతురి వైపు చిరాగ్గా చూస్తూ.

''నిజం మమ్మీ! నేను స్పష్టంగా చూశాను. గిన్నెలు తోముతూనే, జారిపోతున్న ఆ మూటను మాటి మాటికి లోపలకు దోపుకుంటోంది'' అంది

''ఛ...గౌరి అలాంటిది కాదే, దాని కలాంటి బుద్ధుల్లేవు. చాలాకాలంగా అది మనింట్లో పనిచేస్తోంది కదా! దాని సంగతి నాకు బాగా తెల్సు'' అంది మాధవి నమ్మకంగా.

''దాని చెంగులో మూటను నేను క్లియర్‌గా చూశానుమమ్మీ! డర్టీఫెలో..ఛీట్..'' అంది రోషిణి.

''మనింట్లోదయి వుండదే! ఎవరన్నా ఇస్తే తెచ్చుకున్నదేమో?'' అంది మాధవి తాపీగా.

''అదొచ్చినప్పుడు దాని దగ్గర అలాంటి దేం లేదు. అది మనింట్లోదే. నీకేం తెలీదు మమ్మీ! నువ్విలాంటి వేం పట్టించుకోవు..ఓసారి అడిగి చూస్తే పోలా? నువ్వడగకపోతే పోన్లే! నేవెళ్లి నాన్నమ్మతో చెప్తాను. నాన్నమ్మైతే గట్టిగా నిలదీసి అడుగుతుంది'' అంది రోషిణి గదిలో నుండి బైటకు వెళ్ళబోతూ.

''ఆ! ఆ!...ఆగాగు, నాన్నమ్మ పూజలో వుండుంటుంది. నువ్వెళ్ళి చెప్తే, నిజంగా నేనేం పట్టించుకోవడం లేదనుకుంటుంది'' అంది మాధవి, రోషిణిని ఆపి.

''అయితే పద వెళ్లి అడుగుదాం'' తల్లి చెయ్యి పట్టుకొని లాగింది రోషిణి.

''ముందీ సంగతి డాడీతో చెబుదాం. ఆ తర్వాతేం చెయ్యాలో ఆయనే చూసుకుంటారు'' అంది మాధవి డ్రాయింగ్ రూమ్‌వైపు నడుస్తూ.

పేపరు చదువుకుంటోన్న త్రివిక్రమరావుతో విషయం అంతా పూసగుచ్చినట్టు చెప్పారిద్దరూ.

''ఇంట్లో ఇన్ని ఘోరాలు జరుగుతున్నా ఇంటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలా ఎవరికి వాళ్లు చేతికి అందింది పట్టుకుపోతోంటే, చూస్తూ వూరుకున్నావన్నమాట.'' కోపంగా అరిచాడు త్రివిక్రమరావు.

''వూరుకోలేకే మీతో చెప్పాను.'' అంది మూతి ముడుచుకొని, మాధవి.

''ఇలాంటివి కూడ నాతో చెప్పే అడగాలా? అలాంటివన్నీ నువ్వు చూసుకోవచ్చు కదా!'' కోప్పడ్డాడు భర్త.

దాంతో చిర్రెత్తుకొచ్చింది మాధవికి ''నేను కాకపోతే ఇంకెవరు పట్టించుకుంటున్నారీ ఇంటి గురించి. మీ అమ్మగారేమో? పూజలు వ్రతాలు అంటూ ఆ పూజ గదిలోంచి అడుగు బైట పెట్టరు.

**తను పట్నోకి వొచ్చేముందు జరిగింది గుర్తొస్తుంటే..దుఃఖం మరింతగా పొంగు కొచ్చేస్తోంది. తను బయలెల్లే ముందు, అడు సూసిన ఆ సూపు..సిన్నోడి సూపు..కళ్లముందే మాటిమాటికి అగపడ్తూ గుండెల్ని పిండేస్తోంది.ఎప్పట్నించో ఆకలికి కిరకిర్లాడిపోతోన్నట్టున్నాడు బిడ్డ. నాయడు బాబుగోరింటి నుండి పని పూర్తి చేసుకువొచ్చేసరికి, అగ్గగ్గలాడ్తూ వొచ్చేసాడు.**

మావగారికా చెస్సు బోర్డుంటే ఇంకేం పట్టదు. మీరైతే ఏకంగా పేపర్లోనే మునిగిపోతారు. తేరగా నేనే దొరికాను అందరిచేతా మాటలు పడ్డానికి'' విరుచుకుపడింది మాధవి భర్త మీద.

''ఆ రుసరుసలన్నీ ఇక్కడ కాదు. దాందగ్గర చూపించు. ఏం? పేపరు చదవకపోతే..ఎగిరి గంతులెయ్యమన్నావా? ఇలాంటి సిల్లీ విషయాలన్నీ చెప్పి బుర్ర పాడు చేస్తున్నావు?'' అన్నాడు.

విసురుగా వెనక్కు తిరిగింది మాధవి.

''మీతో చెప్పినా పొరపాటే'' అంటూ సణుక్కుంది.

''మమ్మీ! దాని మీద గట్టిగా కేక వెయ్యకే. జంటిల్‌గా అడుగు..పాపం బాధ పడ్తుంది..'' అంది రోషిణి.

''ఏంటే? వూరికినే నేనెందుకు కేకలేస్తాను. నువ్వొ తయారయ్యావా..నాకు చెప్పడానికి?'' మాధవి కోపంతో రోషిణిమీద ఓ ఎగురెగిరింది.

''ఏంటే ఈ పని? నమ్మకంగా వుంటావనుకుంటే ఇలాంటి దొంగ పనులు చేస్తావా?'' అని నిలదీసి, దులిపి పారేద్దామని, అంట్లు తోముతున్న గౌరి దగ్గరికి మాధవి, కోపంగా వెళ్లడం అయితే వెళ్లింది గాని, రోషిణి మాటలు గుర్తొచ్చి కోపాన్ని కొంతవరకూ కంట్రోల్ చేసుకుంది.

''ఏమే గౌరీ! ఎప్పుడూ ఆ ఒక్క చీరే కట్టుకుని కనిపిస్తావు. నీకింకేవీ చీరల్లేవా?'' శాంతంగానే అడిగింది ఆప్యాయత కురిపిస్తూ.

''మరోటి కూడ వుందమ్మ గోరూ! అప్పుడప్పుడూ కట్టుకునొస్తుంటాను గదా! మరో రెండున్నాయిగాని, అయ్యి సుబ్బరంగా సిరిగిపోడం వల్ల రేతిర్లింట్లో కట్టుకుంటాను'' అంది వినమ్రంగా గౌరి.

''మరీ రెండే రెండంటే ఎలాగే?'' అడిగింది మాధవి.

''డబ్బుల్లేక సీర్లు కొనుక్కోలేదండీ. పన్లో కొచ్చేటప్పుడు వుతికిందే కట్టుకువొస్తాను. సుబ్బరంగా నేపోతే మీలాంటోళ్లకి కోపం వస్తాది గదా!''

''ఏమే! మరో రెండు మూడేళ్ళలో కూడ పనిచేస్తున్నావు కదా! ఆ జీతం డబ్బంతా ఏం జేస్తావే?'' అడిగింది మాధవి ఆసక్తిగా.


''జీతం డబ్బుల్లోనా? ఓలమ్మో! జీతం డబ్బులు మిగల్డం:..అయ్యెట్టి నాకు సీర కొనుక్కోడమూనా? అందుకున్న మరుసెణానికే బిల్లబెత్తుల్లా ఎగిరిపోతాయి. ఇక నాకు సీరేం కొనుక్కుంటాను?'' అని బొకా బొకా నవ్వింది గౌరి.

ఆ నవ్వు నాపుకోడానికెంత ప్రయత్నించినా ఆగడం లేదు. ఆ నవ్వింకా..అలా నవ్వుతూనే వుంది.

''మనసారా నవ్వడం అంటే ఇదే'' మాధవి కూడ నవ్వుకుంది.

అలా నవ్వి నవ్వి ఒక్కసారిగా ఆగిపోయింది గౌరి. అది అలుపొచ్చి ఆగడం కాదు. దుఃఖం వొచ్చి ఆగింది. అప్పుడు కనిపించాయి ఆమె కళ్ళ నుండి...చిప్పిల్లిన కన్నీళ్ళు...

జల జల రాల్తూ ముఖంపైనుండి గుండెల మీదకు జార్తొన్నాయి. దుఃఖం ముంచుకొస్తోంది.



తను పనిమనిషినని, పెద్దోళ్ళ ఇళ్ళల్లో తనలాంటి పని మనుషులకు ఏడవడం, నవ్వడం లాంటివి కాని పనులని గుర్తొచ్చి బలవంతాన ఏడుపు నాపేసుకుంది.

అదే తన గుడిసెలో అయితే, గుండెలవిసేదాకా ఏడ్చేసేదే..అలా ఏడ్చి ఏడ్చి నవ్వేసేదే...ఏడుపూ..నవ్వూ..నవ్వూ ఏడుపులతో తన గుండెలోని బరువంతటినీ తీర్చేసుకునేదే..ఆ తర్వాత మళ్ళీ తిరిగి మనసారా నవ్వేసేదే..కాని ఇప్పుడిక్కడ ఎదురుగా అమ్మగారు, ఇంట్లో అయ్యగారు, ముందుగదిలో పెద్దయ్యగారు, పూజగదిలో పెద్దమ్మగారూ వున్నారు. వాళ్ళందరి దగ్గర తానంత హాయిగా మనస్ఫూర్తిగా ఏడవ గలదా? గట్టిగేడిస్తే అల్లందరొచ్చేస్తారు కదా''

కాని దుఃఖం వొచ్చేస్తోంది. ఎంతాపుకుందామన్నా ఆగడం లేదు..తన్నాంటోళ్ళకి దుఃఖం గాక మరేటొస్తాది? నవ్వురావాలంటే బ్రెమ్మాండం బద్దలయిపోవాల. రాదు...వొస్తే ఇదిగిలాగ ఏడుపు వెనకేసుకునొస్తాది.

తను పన్లోకి వొచ్చేముందు జరిగింది గుర్తొస్తుంటే..దుఃఖం మరింతగా పొంగు కొచ్చేస్తోంది. తను బయలెల్లే ముందు, ఆడు సూసిన ఆ సూపు..సిన్నోడి సూపు..కళ్ళముందే మాటిమాటికి అగపడ్తూ గుండెల్ని పిండేస్తోంది.

ఎప్పట్నించో ఆకలికి కిరకిర్లాడిపోతోన్నట్టున్నాడు బిడ్డ. నాయుడు బాబుగోరింటి నుండి పని పూర్తి చేసుకువొచ్చేసరికి, అగ్గ్గలాడ్తూ వొచ్చేసాడు. గుమ్మంలో అడుగెట్టీ ఎట్టగానే ''అమ్మా! కూడొట్టే'' అని అడిగాడు. ఆ అడగడాని క్కూడా ఆడికి ఓపిక నేదు గావాల..వున్న ఓపిగ్గూడ ఆ అడగడంలో కర్చయిపోయింది గావాల..ఏలబడిపోయాడు.

అధాట్టుగా ఎల్లి ఆడ్ని వొళ్ళోకి తీసుకొంది. ఆప్యాయంగా ఆడి వల్లంతా తడిమిన తన వేళ్లకు, ఆడి వొంట్లో వున్న ఎముకలు, బొమికలన్నీ తగిలాయి. ఆకలికి ఆడి పేగులు 'గుర్రు'మంటూ అరుస్తున్నాయి. కూడెట్టే అని ఎంతో ఆశగా అడిగాడు బిడ్డ.

''ఏటున్నాదిరా నీకెట్టడానికి..ఏటి మిగిలున్నాయి..కాసిన్ని నూకలన్నా వుంటే గెంజి కాసెట్టేదాన్ని..మీ అయ్య ఎప్పుడొస్తాడో ఏటో..గింజలట్టుకొని ఆడు రావాల. అయ్యొట్టి నాను కూడొండాల... అంత దాకా అలా కాసింత కునుకు దియ్యి..నిద్దట్లో ఆకలి బాధ మర్సిపోవచ్చట. అదే ఆ దేవుడు మన్నాంటోల్లకిచ్చిన వొరవని నాసిన్నప్పుడు మా అయ్య సెప్తుండే వోడు అలా సెయ్యి. నేదంటే పొద్దుటేల మీ అయ్యకా ఆకలేస్తందని ఏడ్చినావు గదా. అప్పుడు 'డబ్బుల్లేవు నన్నేటి సెయ్యమంతావురా నంజికొడకా' అని, అంతకీ నీ ఏడుపు ఆక్కపోతే..నీ వీపుసీరిసి నాడు గదా అదంతా గుర్తెట్టుకోని ఇప్పుడేడు..బాగా ఏడిస్తే అలుపొస్తాది, దాంతో సక్కగా నిద్రోవొచ్చు..ఆ నిద్దట్లో ఏ బాధా వుండదు. ఏడుపు దరిద్రానికి అప్పసెల్లెలు కదా ఒకదాన్నొకటి వొదిలుండలేవు'' అన్చెప్పి తాను కూడ బోరుమనేడ్సేసింది.

''సిన్న గుంటడు ఆకలేస్తందంటే..ఏడమంటా వేటే! పొద్దుటి గాల్నించి డొక్కలు మాడి సచ్చిపోతన్నాం..పేగులన్నీ ఆకలికి గుర్రుమంటున్నాయి. మద్దినాలంతా ఆకలికి తట్టుకోనేక సొమ్మసిల్లి పడిపోయాను. ఇది గిప్పుడిప్పుడే తెలివొస్తున్నాది. ఇప్పుడూ అదే తీరవా? మమ్మల్నిలాగే సంపేయండ్రా!'' లోపల్నించి కుక్కినులక మంచం మీద నుండి ఏడుస్తూ అరిచాడు ముసలోడు. ఆ తర్వాత సోషొచ్చి పడిపోయాడు. బాధతో కూడిన మూలుగులుగాని ఇనిపించకపోతే..సచ్చిపోనాడేమో! అనుకునేదే!

''నానేటి సేసేదిరా బగుమంతుడా! సిన్న గుంటడికి ఓ పూటన్నా కాసిన్ని గంజినీల్లెయ్యలేక పోతొన్నాను.

ఇకీ సచ్చీ ముసిలోడికి ఎక్కణ్ణించి తేనూ? ఆడేమో పొద్దుటేలే ఆకలికి సి(రెత్తుకొచ్చి గుంటడికి..నాకు నాలుగు తగిలించి..తిట్టుకుంటూ ఎల్లిపోయాడు. ఈల్లని నా ఎదాన పడేసి...ఎల్లిపోయాడు. ఈల్ల సావులు నిరుసావులయిపోనూ.......సచ్చున్నా సచ్చారు కాదు మంద నాకు సావుకొచ్చారు. సావం(డా అందరూ సావండి..ఆకల్తో సచ్చి సాసానాల్లో మన్నూ మసానం అయిపోండి. అప్పుడు..అప్పుడన్నా నాను.... ఏడ్సి ఏడ్సి కళ్ల నీల్లన్నీ ఇంకిపోయాక..ఇక రాల్డానికి రక్తపు సుక్కల్తప్ప మరేటీ మిగలక నానూ సస్తాను...అప్పుడుగాని ఈ జీవరాశికి ఇముక్తి దొరకదు'' అనేసి అక్కడుండలేక పన్లోకి పరుగెత్తు కొచ్చేసింది.

ఇవతల పన్లో కాలిస్సెం అయిపోయిందని అమ్మగారు తిట్టారు. రోషిణమ్మగోరికి బేక్ ఫాస్టు కాలిస్సెం అయిపోయిందంట...పెద్దయ్యగోరికి టీ కాలిస్సెం అయిపోయిందని వొటేల్నించి కారు పంపించి తెప్పించుకున్నారంట. ఇలాగయితే రేపట్నించి పన్లోకి రావొద్దన్నారు. ఆకాడికీ పరుగెత్తుకొనే వొచ్చింది. కాని ఆలిస్సెం అవనే అయింది. ఇంకా జోరుగా పరుగెత్తుకు నొచ్చేదే..నాలుగు రోజుల్నుంచీ ఏమీ తినక పోవడం వల్ల..నీరసానికి కాళ్లు సాగలేదు వొల్లు ఇసుర్తొంది..పడిపోతే..మరింత ఆలిస్సెం అయిపోద్దని ఎలాగో ఈడ్సుకొని..ఒగుర్సుకుంటూ వొచ్చేసింది.

''ఏంటే? ఏంటలా ఆలోచిస్తూ బొమ్మలా నిలబడిపోయావు? నీకెలాగూ పండక్కి పాత చీర ఇస్తాం గదా! ఇదిగో ఇప్పుడే ఇచ్చేస్తున్నాను. తీసుకో..మళ్లీ అప్పుడడగొద్దు. లోపలకెళ్లి మార్చేసుకునొచ్చి'' చేతిలోని చీరను గౌరికిచ్చింది మాధవి.

''అదేంటమ్మగోరూ! ఇప్పుడు నాకు సీరెందుకమ్మా! పండక్కే ఇద్దురు గాన్లెండి. నానేవీ అడగనేదు గదా!'' అంది సిగ్గుపడూ గౌరి.

''అడగకపోతేనేం ఇవ్వకూడదా? వెళ్ళి కట్టుకురా, ఆ పక్కకెళ్లు'' అంది ఎంతో అభిమానంగా మాధవి.

''తర్వాత ఇంటికెళ్లి మార్చుకుంటాన్లెండమ్మా''

''అలాకాదు. ఇప్పుడే ఇక్కడే కట్టుకోవాలి'' అంది మాధవి.

''తర్వాత కట్టుకుంటాన్లెండమ్మా''

అదేం కుదరదు ఇప్పుడే కట్టుకు తీరాలని పట్టుపట్టింది మాధవి.

''ఇప్పుడెందుకమ్మా తర్వాత కట్టుకుంటానంటే వినడం లేదు.''

''ఏంటే? ఏంటి నీ మొండి పట్టుదల?..చీర కట్టుకుని రమ్మంటే..'దాచి పెట్టింది బయట పడిపోతుందేమో' అన్నట్లుగా అంతలా భయపడిపోతున్నావు'' కోపంగా అడిగింది మాధవి.

''అబ్బే భయవేవీ కాదండమ్మా!''

''మరికనేం..కట్టుకో..'' కోపం తీ(వస్థాయికి చేరుకోగా చీత్కారం చేస్తూ అరిచింది మాధవి.

అయినా గౌరి 'తర్వాత కట్టుకుంటా'నని మొరాయించడంతో ఇక దీంతో ఇలా కాదనుకుని మొల్లో దోపుకున్న చెంగును పట్టుకొని విసురుగా లాగింది. గౌరి మొలలో దాచుకున్న పొట్లాం నేలమీద పడింది.

''దొంగ...! ఏంటే? ఈపని? నమ్మకంగా పనిచేస్తున్నావని అనుకుంటే ఇదా నువ్వు చేసిన...నిర్వాకం'' గౌరి చెంప 'ఛెళ్లు' మనిపించింది మాధవి.

గుతుక్కుమని పోయింది గౌరి..''ఏంటమ్మగారూ! ఏం జరిగింది?'' అడిగింది అమాయకంగా గౌరి.

''ఆహా ఎంత గొప్పగా ఏక్ట్ చేస్తున్నావే?'' తిట్టింటి మాధవి.

గౌరికి దుఃఖం గుండెల్లోకి ఎగదన్నుకొచ్చింది. ''నాను దొంగను కాదండీ! అంత ఖర్మ నాకేం పట్టలేదు. సస్తే ఆకల్తో మాడన్నా సస్తాం గాని..ఆ పని మాత్రం సెయ్యం అండీ!'' ఏడ్చింది గౌరి.

''ఇక ఆపు ఆ దొంగేడుపులు'' కోపంతో అరిచాడు త్రివిక్రమరావు.

''ఎంతకాలం నుండీ ఇలా చేస్తున్నావే..నువ్వు దోచుకుపోడానికి నా ఇల్లే దొరికిందా? బియ్యాలు..పప్పులు..పంచదార..ఇలా ఎంత దోచుకెళ్లిపోయిందో..పోలీసులకి పట్టిస్తాను..నీలాంటి దొంగల్ని ఇంతతేలిగ్గా వొదిలిపెట్టకూడదు'' ఫోను చెయ్యడానికి లోపలకెళ్లాడు త్రివిక్రమరావు.

ఆ కేకలకు ఇంట్లో వున్న పెద్దయ్యగారు, పెద్దమ్మగారు కూడ అక్కడ కొచ్చారు.

''అరరే! ప్రసాదం..ఎవర్రా అలా ప్రసాదాన్ని నేలపాలు చేశారు? ఏవే నీకు కళ్లు నెత్తిమీద కొచ్చాయా...ఏదో తింటావని ఇంత ప్రసాదం ఇస్తే..ఇలా నేలపాలు చేశావా?'' కోపంగా అరిచారు పెద్దమ్మగారు.

''పొరపాటయి పోయిందమ్మా! తిందామనే అనుకున్నాను. కాని ఇంటి దగ్గర మా సంటోడు, ముసిలోడు ఆకల్తో వున్నారు, తింటారని దాసుకున్నాను.'' నొచ్చుకుంటూ జరిగిన దానికి సంజాయిషీ ఇచ్చుకుంటూ, నేలపడిన ప్రసాదాన్ని కళ్ళకు అద్దుకుని జాగ్రత్తగా తిరిగి పొట్లాంలోకి ఎత్తుకుంటోంది గౌరి. అప్పటికిగాని మాధవికి తను చేసిన పని పొరపాటు పనని అర్ధం కాలేదు. అది అత్తగారు గౌరికి తినమని ఇచ్చిన పొట్లాం అని ఆమెకు తెలియలేదు. తినాల్సిన దాన్ని తను కోపంతో విచక్షణ మర్చిపోయి నేలపాలు చేసింది. అనవసరంగా నోరుపారేసుకుంది.''

తినకుండ నేలపాలయిన ప్రసాదాన్ని కళ్ళకు అద్దుకుని పొట్లాంలోకి ఎత్తడంలో సహాయం చేసింది.

'పాపం..గౌరిని అనవసరంగా అనుమానించి అవమానించింది తను.' బాధపడ్తోంది మాధవి.

గౌరి ఎత్తుతోన్న ప్రసాదం అంతా దాని కళ్ళనుండి కురుస్తున్న అశ్రువులతో తడిసిపోతోంది.

''ఇంద గౌరి'' రోషిణి మాట విని తలెత్తింది మాధవి.

వెక్కివెక్కి ఏడుస్తూ చేతిలో ప్రసాదం వున్న స్టీలు పాత్రతో నిలబడుంది రోషిణి.

''తీసుకోవే!..ఆ ప్రసాదం..నువ్వు ఇంత తిని మిగతాది మీ యింట్లో వాళ్ళకు పెట్టు...నీలాంటి వాళ్లు తిన్నప్పుడే ఇది ప్రసాదం అవుతుంది. వెళ్లేటప్పుడు కాస్తంత అన్నం కూడ పట్టుకెళ్లు'' అన్న అత్తగారి మాటలు మాధవికి అమృతప్రాయంగా వినిపించాయి.

చిన్నపిల్ల మాటలు విని పనిమనిషిని గొడవ చేసినందుకు లోలోన ఇంకా సిగ్గుపడుతూనే వుంది మాధవి!

★



## పాపం దీప్తి!

'పెళ్లిసందడి' లాంటి సూపర్ డూపర్ హిట్ చిత్రంలో నటించినా కూడా అవకాశాలకోసం అర్రులు చాచాల్సిన పరిస్థితి దీప్తి భట్నాగర్‌కి రావడం నిజంగా శోచనీయం అనుకుంటున్న సమయంలో నాగార్జున చిత్రం 'ఆటోడ్రైవర్' లో ఆమెకి చాన్స్ రావడంతో హమ్మయ్య పర్వాలేదు, దీప్తికి మంచిరోజులు వచ్చినట్టే అని ఆమెతో పాటు అంతా అనుకున్నారు. కానీ ఈ సినిమా తీరా విడుదలయ్యాక చూస్తే అంతంతమాత్రంగా వుండడంతో దీప్తిని పట్టించుకునే వాళ్లే లేరిప్పుడు. తొలి చిత్రం హిట్టయినా రాని చాన్స్‌లు మలి చిత్రం ఫట్టయితే ఎక్కడ్నుంచి వస్తాయి చెప్పండి. ఇక దీప్తి బాలీవుడ్‌లోనే ఏదో రకంగా హీరోయిన్ అవకాశాల్ని చేజిక్కించుకోవడానికి ట్రై చేయడం మంచిదేమో అంటున్నారు ఆమె సన్నిహితులు!

-జె.ఎం.